# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 11, జులై 2026





## విద్యాసంస్థల బంద్ విజయవంతం

**ఆసిఫాబాద్, జూలై 10, ప్రభాతవార్త**

వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విద్యాసంస్థల బంద్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైందని పీడీఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో విద్యారంగ సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ వాటి పరిష్కారంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలోని 24 వేల పాఠశాలలను కేవలం 4 వేల పాఠశాలలకు కుదించే ప్రతిపాదన వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని, గిరిజన జిల్లాల భవిష్యత్తుపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల కుదింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి వాటిలో మధ్యాహ్న భోజన పథకాన్ని బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టేందుకు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, తమ డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, ఎస్ఎఫ్ఐ నాయకులు సాగర్, మహేష్, పీడీఎస్యూ జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యుబ్ ఖాన్, మండల అధ్యక్షుడు సమీర్, నాయకులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



### బోధన నైపుణ్యాల పెంపుతో విద్యార్థులకు

## నాణ్యమైన విద్యనందించాలి

* ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచనలు

**మంచిర్యాల, జూలై 10, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భౌతిక శాస్త్ర బోధనలో ఆధునిక సాంకేతిక మిగతా 2లో..

## చెత్త నుంచే ఆదాయం..

## సేంద్రీయ ఎరువులు తయారు చేయాలి




● సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు

● అంకితభావంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని పిలుపు

**నిర్మల్, జులై 10, ప్రభాతవార్త:**

గ్రామాల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు చెప్పారు. ముధోల్ మండలం తరోడ గ్రామంలో శుక్రవారం గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధించాలంటే సర్పంచులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రామ పరిపాలన అంశాలపై ప్రతి సర్పంచ్‌కు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత ప్రాధాన్యమైన అంశమని చెప్తూ.. చెత్త సేకరణపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చెత్త నుంచే ఆదాయం పొందే అద్భుతమైన అవకాశం ఉందని, సేకరించిన తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టి గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం మిగతా 2లో..

## నిర్మల్ జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

✪ నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జులై 10, ప్రభాతవార్త:**



జిల్లాలో పారదర్శక పాలన, ఎన్నికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌లోని అన్ని రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక వ్యవస్థ ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది సీసీ కెమెరాల ద్వారా 24 గంటల పర్యవేక్షణ చేపట్టి గోదాంకు పటిష్ట భద్రత కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసీల్దార్ రాజు, ఆర్డీఓ స్వాతి పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఎస్డీ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు మీ ప్రమాణం యాప్‌తో పాటు ఉద్యోగుల హాజరు, పనితీరును పర్యవేక్షించే సమగ్ర డ్యాష్‌బోర్డ్ వ్యవస్థను అమలు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రెవెన్యూ, మీసేవ, వైద్య, విద్య తదితర శాఖల 70-80 శాతం సేవలను ఈ యాప్‌తో అనుసంధానం చేసి ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వివిధ శాఖలు వేర్వేరు యాప్‌ల ద్వారా ఉద్యోగుల హాజరు నమోదు చేస్తున్నాయని, అన్ని శాఖల వివరాలను ఒకే డ్యాష్‌బోర్డ్‌లోకి తెచ్చి ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేసి, ఉద్యోగుల హాజరు, పనితీరు పర్యవేక్షణలో నిర్మల్ జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఈడీఎం నదీమ్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్యాసంస్థల బంద్ సంపూర్ణ విజయవంతం

**- ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై వామపక్ష విద్యార్థి సంఘాల ఆగ్రహం - ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్**

**భైంసా, జులై 10, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా, విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ నియోజకవర్గ వ్యాప్తంగా సంపూర్ణంగా విజయవంతమైంది. నియోజకవర్గ కేంద్రంతో పాటు భైంసా, లోకేశ్వరం, కుంటాల, తానూరు మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూతపడి బంద్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ మరియు వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాశాఖకు కనీసం ఒక ప్రత్యేక మంత్రిని కూడా కేటాయించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించే విలీన ఆలోచనలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్, మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి, లెక్చరర్ పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల ఫీజుల దోపిడీని అరికట్టడానికి బలమైన ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, విద్యార్థులకు చెందాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, తాము లేవనెత్తిన 19 ప్రధాన డిమాండ్లను పరిష్కరించకపోతే విద్యార్థి లోకాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్‌ను విజయవంతం చేసిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరియు విద్యాసంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలలో పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్, జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్, జిల్లా కమిటీ నాయకులు లంబాడి రాజారామ్, ప్రతాప్, శీతల్కార్ దీపక్, వివిధ సంఘాల జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## చెత్త నుంచే ఆదాయం.. సేంద్రీయ ఎరువులు తయారు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సమకూర్చుకోవచ్చని వివరించారు. గ్రామాల ప్రగతికి ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అంకితభావంతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బోధన నైపుణ్యాల పెంపుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

(మొదటిపేజీ తరువాయి)

పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించాలని తెలిపారు. కృత్యాధార బోధన, ప్రయోగాల ద్వారా అభ్యసనాన్ని ఆసక్తికరంగా మార్చాలని, ప్రతి విద్యార్థికి డిజిటల్ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్న కలెక్టర్, విద్యార్థుల హాజరు పెంపునకు తల్లిదండ్రులతో సమన్వయం చేయాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోటపల్లి నూతన రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా జక్కేపల్లి మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ

**- ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తా**

**- నూతన ఆర్ఐ పారదర్శకంగా పనిచేయాలని తహసీల్దార్ రాఘవేంద్రరావు సూచన**

**కోటపల్లి, జులై 10 ప్రభాతవార్త:**



కోటపల్లి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా జక్కేపల్లి మురళీకృష్ణ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ పదోన్నతిపై వెళ్లడంతో, ఆయన స్థానంలో బదిలీపై వచ్చిన మురళీకృష్ణను ప్రభుత్వం ఇక్కడ నియమించింది. తహసీల్దార్ రాఘవేంద్రరావు సమక్షంలో మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా రెవెన్యూ సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం నూతన ఆర్ఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొని నూతన ఆర్ఐకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



## బెల్లంపల్లి ఆసుపత్రిలో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ

**- వైద్య సేవలపై సమగ్ర సమీక్ష**

**బెల్లంపల్లి, జులై 10, ప్రభాతవార్త:**

మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ బెల్లంపల్లి ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిని సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్య సంచాలకులు డాక్టర్ రవికుమార్ లతో కలిసి క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా డాక్టర్ సుధాకర్ నాయక్ ఐదుగురు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని, వారికి ఆరు నెలల పాటు నిరంతరంగా పోషకాహార కిట్లు అందించేందుకు ముందుకు రావడం ప్రశంసనీయమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోగుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు, సమాజంలో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఉందన్నారు. తదుపరి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ప్రసూతి సేవలు, అసంక్రమణ వ్యాధుల (ఎన్ సి డి) నిర్ధారణ మరియు చికిత్సలు, క్షయ వ్యాధి గుర్తింపు మరియు చికిత్స విధానాలు, అవగాహన కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్‌కు రక్త నమూనాల పంపిణీ, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, వేగవంతతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా 30 సంవత్సరాల పైబడిన ప్రజలకు అసంక్రమణ వ్యాధుల స్క్రీనింగ్‌ను విస్తృతంగా నిర్వహించి, వాటి వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అత్యవసర ఔషధాల నిల్వలు సమృద్ధిగా ఉండేలా చూడాలని, పాము కాటు, కుక్క కాటు వంటి అత్యవసర పరిస్థితులకు అవసరమైన వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా నిల్వ ఉంచి, అవసరమైన వారికి తక్షణం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిన్నపిల్లలు మరియు నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొంటూ, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ మూర్తితో చర్చించి, సేవల మెరుగుదలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఒకటి నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించే కార్యక్రమాన్ని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, సీహెచ్ఓ నాందేవ్, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, క్షయ వ్యాధి విభాగ సిబ్బంది, ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా ఆరోగ్య కార్యకర్తలు మరియు క్షయ వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే

**భైంసా, జులై 10, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఇందిరమ్మ పథకానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందన్నారు. నియోజకవర్గంలో దశలవారీగా అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు. గత పది సంవత్సరాల కాలంలో అప్పటి ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్లే పేదలకు ఇండ్ల నిర్మాణానికి నిధులు రాలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా పనిచేస్తోందని, నిధుల కొరత లేకుండా చూస్తోందని చెప్పారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఎంపీడీఓ నీరజ్ కుమార్, మాజీ సర్పంచులు సిరం సుష్మారెడ్డి, సిరం రాజమణి శ్రీనివాస్, ప్రముఖ నాయకులు అప్పాల రాకేష్, అశోక్, సుధాకర్, గంగాప్రసాద్, బాలాజీ పటేల్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సీపీఐ మందమర్రి నూతన మండల కమిటీ ఎన్నిక

**- ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలి**

**- జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**

**మందమర్రి, జులై10. ప్రభాతవార్త:**

మందమర్రి పట్టణ స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కాదండి సాంబయ్య అధ్యక్షతన సీపీఐ మందమర్రి మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమాల బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో 13 మంది సభ్యులతో కూడిన మండల కార్యవర్గం, 21 మంది సభ్యులతో కూడిన మండల కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఆమోదించి నూతన మండల కమిటీని ప్రకటించారు. మండల కార్యదర్శిగా వనం సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా తాళ్లపల్లి వీరయ్య, కోశాధికారిగా బండారి రాజేశం, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రొడ్డ నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలను గ్రామ గ్రామానికి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, నక్క వెంకటస్వామి, మామిడి గోపి, మహిళా నాయకురాలు రొడ్డ తిరుమల తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా 24వ త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం

**మందమర్రి, జూలై 10, ప్రభాతవార్త:**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలకు సంబంధించిన 24వ వార్షిక త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గనుల్లో భద్రతా ప్రమాణాల అమలు, ప్రమాదాల నివారణ, కార్మికుల సంక్షేమం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు, డీజీఎంఎస్ ఉన్నతాధికారులతో కలిసి సమావేశాన్ని ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు క్లబ్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. సమావేశం ప్రారంభంలో సింగరేణి, డీజీఎంఎస్ గీతాల ప్రదర్శన అనంతరం అందరితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. గని ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎంఎస్ (మైనింగ్) సాగేష్ కుమార్ మాట్లాడుతూ, గనుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతా సూత్రాలను తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు. భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ గనుల్లో ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మందమర్రి ఏరియాలో ప్రమాదాల శాతాన్ని 'జీరో' స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న కీలక ప్రాంతాల్లో అనుభవజ్ఞులైన సిబ్బందినే నియమించాలని, కార్మికుల ఆరోగ్య




పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. సింగరేణి డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంస్థలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, రక్షణ చర్యల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేస్తూ భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ఉత్పత్తి లక్ష్యాలను విజయవంతంగా సాధిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం సాయిబాబు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గనిలో పనిచేసే ఉద్యోగికి 'సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్'పై పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు గనుల్లో భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఆధునిక యంత్రాలు, నూతన సాంకేతికత వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఈ సూచనలపై సింగరేణి అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్ (మైనింగ్) దీపక్ కుమార్ ప్రభాకర్, డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి, మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీరమేష్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం సాయిబాబు, కార్మిక సంఘాల నాయకులు సలేంద్ర సత్యనారాయణ, ఎస్. తిరుపతి అలాగే బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) రఘు కుమార్, జీఎం (రెస్క్యూ) శ్రీనివాస్ రెడ్డి, సిఎంఓఏఐ ప్రతినిధులు, ఏరియా ఏజెంట్లు, గని మేనేజర్లు, విభాగాధిపతులు, సేఫ్టీ అధికారులు, యూనియన్ ప్రతినిధులు, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్లు, పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న టిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

## జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, కల్పించాలి

### అదనపు కలెక్టర్ చంద్రయ్యకు టిడబ్ల్యూజేఎఫ్ వినతి పత్రం

**మంచిర్యాల, జూలై 10, ప్రభాతవార్త:**

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కల్పించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల కుటుంబాల విద్యా భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ, ఉచిత విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు కోడూరి శ్రీనివాస్, సతీష్, సందీప్, రాజేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 10, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ టౌన్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ (మెయింటెనెన్స్) పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. నిర్వహణ పనులు పూర్తయ్యే వరకు కాగజ్‌నగర్ టౌన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి శాఖకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## సూపాకలో సీజనల్ వ్యాధుల ముందస్తు వైద్య శిబిరం

**కోటపల్లి, జూలై 10 ప్రభాతవార్త:**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని సూపాక గ్రామంలో ఏఎన్ఎం మాధవి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, అతిసారం వంటి సీజనల్ వ్యాధుల లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండనివ్వకపోవడం, తాగునీటిని మరిగించి తాగడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు. జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

### గ్రామంలో "డ్రై డే" నిర్వహణ..

వైద్య శిబిరంతో పాటు గ్రామంలో "డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండ్లు మరియు పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం, నీటి పాత్రలను శుభ్రపరచడం, దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించడం వంటి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాశెట్టి సతీష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ ఆరోగ్య శాఖ అధికారులకు సహకరించి పరిశుభ్రతను పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మాధవి, సర్పంచ్ కాశెట్టి సతీష్, ఆశా కార్యకర్త రజితతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ కాశెట్టి సతీష్, ఏఎన్ఎం మాధవి, ఆశా కార్యకర్త రజిత, గ్రామస్తులు

## ఎస్ఐఆర్ తెలంగాణ సహాయ కేంద్రం ప్రారంభం

### - ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : డా. కొత్తపల్లి అనిత శ్రీనివాస్

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 10, ప్రభాతవార్త :**

లబ్ధిదారులు ఎస్ఐఆర్ ఫారాలను సులభంగా నింపుకునేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత శ్రీనివాస్ తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎస్ఐఆర్ - తెలంగాణ సహాయ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. అనిత శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మార్గదర్శకత్వం, సహాయం అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని లబ్ధిదారులందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకుని తమ ఫారాలను సక్రమంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయడమే ఈ సహాయ కేంద్రం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ లోయ, దెబ్బటి శ్రీనివాస్, రాజేందర్ జంజోడ్, ముకేశ్ కటోర్, శ్రీరాములు జగ్గయ్యతో పాటు భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా. కొత్తపల్లి అనిత శ్రీనివాస్



జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

## ఘనంగా జాతీయ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు

### - మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి గంగపుత్ర సంఘం విజ్ఞప్తి

**మంచిర్యాల, జూలై 10, ప్రభాతవార్త:**

జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో తెలంగాణ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేస్తూ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నేన్నెల నరసయ్య, పట్టణ అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ మత్స్యకారుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఉచిత చేప పిల్లలకు బదులుగా నగదు బదిలీ చేయడం, మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న పరిహారం వెంటనే చెల్లించడం, అర్హులైన మత్స్యకారులకు అధిక రాయితీపై వాహనాలు అందించడం, ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువజన అధ్యక్షుడు మంచెర్ల సదానందం, శాఖపురం భీమ్సేన్, గగ్గూరి రాజన్న, మనోహర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### - మున్సిపల్ కమిషనర్‌కు భారత రాష్ట్ర సమితి నాయకుల వినతిపత్రం



**మంచిర్యాల, జూలై 10, ప్రభాతవార్త:**

మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణ మాజీ అధ్యక్షుడు గాదె సత్యం మాట్లాడుతూ మాజీ శాసనసభ్యుడు నడిపెల్లి దివాకర్‌రావు, రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. నగరంలోని పారిశుద్ధ్యం, తాగునీరు, మురుగునీటి పారుదల, వీధి దీపాలు, అంతర్గత రహదారులు తదితర సమస్యలను ప్రాధాన్యంతో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సత్తార్, మాజీ కౌన్సిలర్లు తోట తిరుపతి, పోరెడ్డి రాజు, నాయకులు ఓడ్నాల రవీందర్, పడాల రవీందర్, బల్లికొండ రమేష్, జాడి భానుచందర్, జక్కం జగన్, బొడ్డు పద్మ, పుప్పాల స్వర్ణాకర్, కుందరపు రమేష్, నక్క తిరుపతి, జావిద్, రామగిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్లేట్లు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్న నిర్మల్ లైన్స్ క్లబ్ సభ్యులు, చిత్రంలో పాఠశాల ఉపాధ్యాయులు

## విద్యార్థులకు స్లేట్లు, పెన్సిళ్లు పంపిణీ చేసిన లైన్స్ క్లబ్

### - చించోలి(ఎం) పాఠశాలలో సేవా కార్యక్రమం
### - క్లబ్ సభ్యులకు ఉపాధ్యాయుల కృతజ్ఞతలు

**సారంగాపూర్, జులై 10, ప్రభాతవార్త:**

మండలంలోని చించోలి (ఎం) ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు నిర్మల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్లేట్లు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచేలా ఈ విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మరిన్ని సేవా కార్యక్రమాలు అందించడానికి తమ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. చిన్నారులకు అవసరమైన సాయం అందించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు లైన్స్ క్లబ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎల్ఎన్ఎస్ వెంకటరమణారెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్ గుప్తా, ట్రెజరర్ పూదరి విజయ్ కుమార్, ప్రముఖ సభ్యులు చంద్రమోహన్ రెడ్డి, లక్కడి రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్‌ఘాతంతో గోశాల లేగదూడ మృతి

### - ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**బజార్‌హత్నూర్, జులై 10, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. అధికారుల అశ్రద్ధ కారణంగా గురువారం స్థానిక శ్రీరామ్ గోశాలకు చెందిన ఒక లేగదూడ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు, గోశాల నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో విద్యుత్ తీగలు, స్తంభాలు సరిగ్గా లేకపోవడం, విద్యుత్ సరఫరా వ్యవస్థలో లోపాల కారణంగానే ఈ ప్రమాదం జరిగింది. గత సంవత్సరం కూడా సరిగ్గా ఇదే సమయంలో శ్రీరామ్ గోశాలకు చెందిన మరొక లేగదూడ విద్యుత్ షాక్‌తోనే ప్రాణాలు కోల్పోయిందని వారు గుర్తు చేశారు. వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా, పశువుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. గత ప్రమాదం జరిగినప్పుడే అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు తీసుకుని ఉంటే, ఇప్పుడు మరో మూగజీవి ప్రాణం పోయేది కాదని గోశాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను, స్తంభాలను తక్షణమే పునరుద్ధరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా

# కుటుంబ సంక్షేమంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

### - జూలై 11 నుంచి 18 వరకు జిల్లావ్యాప్తంగా ప్రచారం
### - పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లను విడుదల చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

**మంచిర్యాల, జూలై 10, ప్రభాతవార్త:**

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 11 నుంచి 18 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న కుటుంబ సంక్షేమ అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల పరిధిలో వైద్యులు, ఆశా కార్యకర్తలు కుటుంబ నియంత్రణ తాత్కాలిక, శాశ్వత పద్ధతులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. చిన్న కుటుంబం సంతోషకరమైన, ఆరోగ్యకరమైన కుటుంబానికి నాంది అని, పిల్లల మధ్య తగినంత విరామం పాటించడం ద్వారా కుటుంబ సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ విభాగం అధికారులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అవగాహన ప్రచార సామగ్రిని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

### - లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని విద్యార్థులకు రఘునాథ్ వెరబెల్లి సూచన

**మంచిర్యాల, జూలై 10, ప్రభాతవార్త:**

ఘునాథ్ వెరబెల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల నగరంలోని గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠశాల సంచులు, నోట్ పుస్తకాలు, గణిత పరికరాల పెట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి ఏడాది ప్రోత్సాహం అందిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, కార్పొరేటర్ కస్తూరి నాగరాజు, జోగుల శ్రీదేవి, ఆకుల అశోక్ వర్ధన్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, బింగి ప్రవీణ్, మెరెడిగొండ శ్రీనివాస్, బింగి సత్యనారాయణ, బుద్ధారపు రాజమౌళి, ముల్కాల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

### - ఈ నెల 24 నాటికి వివరాల నమోదు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఉప ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ ఆదేశం

**మంచిర్యాల, జూలై 10, ప్రభాతవార్త:**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేలు, వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం ఉప ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన దృశ్య సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడానికి చర్యలు తీసుకోవాలని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. ఈ నెల 24 నాటికి వివరాల నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా క్రమబద్ధీకరణ చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల వివరాల సేకరణ 99.6 శాతం, వివరాల నమోదు 21.94 శాతం పూర్తైందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు.

## తప్పిపోయిన వ్యక్తిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన సిర్పూర్ (టి) పోలీసులు

### - కానిస్టేబుల్ శరత్‌కుమార్‌కు ఎస్ఐ సాగర్ ప్రశంసలు, రివార్డు

**సిర్పూర్ (టి), జూలై 10, ప్రభాతవార్త :**



విధి నిర్వహణలో అప్రమత్తత, సేవాభావం ప్రదర్శిస్తూ సిర్పూర్ (టి) పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన నారా మల్లేష్ (36) ఈ నెల 8న సిర్పూర్ (టి) మండలం పెద్దబండ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో తప్పిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే సిర్పూర్ (టి) ఎస్ఐ సాగర్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ శరత్ కుమార్ గాలింపు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో విస్తృతంగా గాలించిన అనంతరం అదే రోజు రాత్రి సుమారు 11 గంటలకు మల్లేష్ ఆచూకీని గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం మల్లేష్‌ను ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు క్షేమంగా అప్పగించారు. కానిస్టేబుల్ శరత్ కుమార్ విధి పట్ల చూపిన అప్రమత్తత, అంకితభావం, సేవాస్ఫూర్తిని అభినందించిన ఎస్ఐ సాగర్ ఆయనకు రివార్డు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పోలీసులు పేర్కొన్నారు.

# విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు దోహదం

### - జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య

**మంచిర్యాల, జూలై 10, ప్రభాతవార్త:**

మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలోని జిల్లా విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి, అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆరోగ్య వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. సమావేశంలో జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి ఎం.డి. యాకూబ్ గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన క్రీడా పోటీలను సమీక్షించి, 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పోటీల నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, సుమారు 70 మంది వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య